715108801

ఎన్ని విద్యలైన ఏపార చదివిన
పొట్టకూటికెగాని గిట్టుబోవు
మట్టిబొమ్మలోని మర్మంబునెరుగని
చదువులన్ని పరము చేర్చగలవా.
తత్త్వమడుగంటె సినిమాలు తలకుపట్టె
ఒప్పులన్ని సంఘాన తప్పులయ్యె
యుక్తి కేంద్రాలుగా మారె భక్తియందు
సత్యమును దెల్పుమాట శ్రీ సత్యసాయి మాట

ప్రేమ స్వరూపులారా!

సహస్ర శీర్షాః పురుషః సహస్రాక్ష సహస్ర పాత్. అన్ని శిరస్సులు, అన్ని నేత్రములు, అన్ని పాదములు అతనివి. ప్రతి ప్రాణి పరమాత్మని ప్రతిబింబమే. ఈ ప్రకృతి మాతృస్వరూపిణి. ఈ ప్రపంచమునందు ఏ ఒక్క వస్తువు కూడను పరమాత్ముడు కానిది లేదు. సమస్త పదార్థములు పరమాత్మ స్వరూపములే. విశ్వం విష్ణుస్వరూపమ్. ఈ ప్రపంచము భగవంతుని విశాలమైన సృష్టి స్వరూపము. మానవుడు భగవంతుని ప్రకృతి స్వరూపకముగా దర్శిస్తూ కూడను భగవంతుడు కనుపించలేదని బాధపడుతున్నాడు. భగవంతుని ప్రకృతి స్వరూపము చూచుచూ భగవంతుని చూడలేదని భావించటము యిదే పెద్ద మూఢత్వము. ప్రపంచమునందు అనేక రూపనామములతో కూడిన వస్తువులను చూచుచున్నాడు మానవుడు. ఇవన్నీ కూడను కేవలము భిన్న స్వరూపములుగా విశ్వసిస్తున్నాడు మానవుడు. కాని సత్యతత్వాన్ని గుర్తించుకోటానికి ప్రయత్నించటము లేదు. నిత్యసత్యమైన ప్రకృతిని అసత్యముగా భావించి సత్యమైనది యేదియో యీ మిథ్యమానందు కలదని విశ్వసిస్తున్నాడు

ఈ జగత్తునందు సత్యమైనది ఒకటి అసత్యమైనది మరొకటి అని రెండు పదార్థములు లేవు. దృష్టి దోషము చేత మానవుడు ఒకే వస్తువును భిన్నత్వముగా దర్శిస్తూ వున్నాడు. ఒక విత్తనము భూమిలో నాటినప్పుడు ఆవిత్తనము తనస్వరూపాన్ని శిథిలము గావించుకొని గొప్ప వృక్షముగా రూపొందుతున్నది. ఈ వృక్షమునందు యనేక కొమ్మలు, రెమ్మలు, ఆకులు పువ్వులు, కాయలు అనేక రూపనామములతో మనకు దర్శింప చేస్తున్నవి. కానీయీ భిన్నరూపములకు ఆధారమైన విత్తనము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించినప్పుడే ఏకం సత్ విప్రా బహుధా వదంతి అనే సత్యాన్ని మనము అర్థము చేసుకున్న వారము వుతాము. ఉన్నది ఒక్కటే అయినప్పటికి అనేకమంది అనేక రూపముల చేత, అనేక నామముల చేత అనుభవిస్తున్నాడు.

చిత్రంబులు త్రైలోక్యప
విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

అనింది భాగవతము. సృష్టి విచిత్రంబులు ఎంత విచిత్రమయ్యా. ఈ సృష్టియొక్క చిత్రంబులు గుర్తించుకోటం అందరికి సాధ్యము కాదు. ప్రకృతి పరమాత్మ స్వరూపమనే సత్యాన్ని గుర్తించిన వ్యక్తులకు మాత్రమే యీ సత్యము ను కొంతవరకు అర్థము చేసుకోగలరు. నేను నేను అనే అహంకారము తలలో చేరి నంతవరకు నాది నాది అనే మమత్వము హృదయములో వుండి నంతవరకు, సర్వ వ్యాపకత్వమైన సచ్చిదానంద స్వరూపము గుర్తించటానికి వీలుకాదు. నేను నాది సర్వము భగవత్ స్వరూపమే అనే సత్యమును గుర్తించాలి. యద్భావం తద్భవతి. ఎవరెవరి భావములు పురస్కరించుకొని ఆ భగవంతుడు ఆ భావ స్వరూపాన్ని అందిస్తా వుంటాడు. కనుక యీ ప్రకృతియందు వున్న సమస్త పదార్థములు కూడను భగవంతుని భిన్న స్వరూపములుగానే మనము విశ్వసించటము అత్యవసరము.

ఈ ప్రకృతి యందు సృష్టి స్థితి లయములకు కూడను యీ శక్తులే ఆధారము ఈ ప్రకృతిలో యిచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అనే భిన్న రూపములు ధరించి దుర్గ, లక్ష్మి, సరస్వతి అనే స్వరూపములతో దర్శింప చేస్తున్నాయి. ప్రకృతి మాతృస్వరూపిణి. ఏ దేశమునవారైన కూడను ప్రకృతిని తల్లిగానే భావిస్తూ వుంటారు. ఏ దేశము వారైనా కూడను మాతృ దేశమనే చెబుతారుగాని పితృదేశమని పలకటం లేదు. కనుక యీ మాతృ దేశమునందు ప్రధానమైన తత్వము శక్తి. మానవుని యందు శరీర, మానసిక, ఆధ్యాత్మిక తత్వమునందు దివ్యత్వము అనే శక్తిని ప్రసరింప చేసేదే యీ యొక్క శక్తి స్వరూపిణి. ఇలాంటి శక్తి యొక్క తత్వము సర్వుల యందు కూడను వున్నదనే సత్యాన్ని నిరూపించటానికి కొన్ని ఉదాహరణములు. పురాణములందు చక్కని ఆదర్శవంతమైన కథ కలదు. ఒకానొక సమయమునందు వ్యాసులవారికి కోపం వచ్చింది. అన్నపూర్ణయైన పార్వతిని కాశీలో దూషించాడు. అప్పుడు ఈశ్వరుడు వ్యాసుల వారిని తరుమగొట్టాడు. ఈ వియోగముచేత దీక్షను బూని తానొక నూతనమైన పట్టణమును నిర్మించాడు. గంగను వెళ్ళి ప్రార్థించాడు. గంగా యీ నూతన పట్టణమునకు చుట్టూ నీవు గంగ స్వరూపము ధరించి యిటు ప్రవహించాలన్నాడు. గంగ చెప్పింది. వ్యాసా నకేమైనా మతి పోయిందా? పార్వతి హృదయాన్ని నొప్పించి గంగను ప్రార్థించినంత మాత్రమున నేను వేరు పార్వతి వేరు స్త్రీలు వేరుగా భావిస్తున్నావా? జగత్తునందు కల సమస్త స్త్రీలు పార్వతి స్వరూపులే. ఆమె యొక్క ప్రతిబింబములే. కేవలము నేను పురుషుడనే భ్రాంతికి లొంగి, అహంకారము చేత తనయొక్క భావమును కృత్రిమంగా వుపయోగపరచుకుంటున్నాడు. కాని నిజమునకు యితను పురుషుడు కాడు. ప్రకృతి మయుడే. ఈ ప్రకృతియందు లభించెడి వెండి బంగారు యింకా అనేక విధములైన విలువైన యివన్నీ కూడను

మట్టి రూపకముగానే, మట్టి మయముగానే గోచరిస్తూ వున్నాయి. పురుషులు, స్త్రీలు, చెట్లు, గుట్టలు క్రిమికీటకాదులు సర్వము మట్టి మయముగానే వుంటున్నాయి. ఈ ప్రకృతియందు పుట్టిన సమస్త పదార్థములు కూడను ప్రకృతి మయములే గాని అన్యమయములు కావు. అయితే యిక్కడ కొన్ని విధములైన ఆదర్శములను మనము కొంతవరకు గుర్తించాలి.

పాండవాగ్రజుడైన ధర్మజుడు, అర్జునుడు కృష్ణునకు అతి సన్నిహితులు. వీరు అత్యంత సన్నిహితులు. ప్రేమపాత్రులు. అయినప్పటికి వారు యెన్నియో పర్యాయములు వారు కృష్ణుని ప్రార్థించినప్పటికిని కృష్ణుడు వారి ప్రార్థనను అంగీకరించి ప్రత్యక్షము కాలేదు. ఏ క్షణమునందైనా సరియే ద్రౌపది హే కృష్ణా అని ప్రార్థించిన తక్షణమే కృష్ణుడు ప్రత్యక్షమయ్యేవాడు. దీని యొక్క అంతరార్థము యేమిటి? స్త్రీలు ప్రార్థించిన తక్షణమే భగవంతుడు ప్రత్యక్షము కావటము, పురుషులు ప్రార్థించినప్పుడు అతను యేవిధమైన జవాబు యివ్వకుండా వుండటము యిందులో వున్న అంతరార్థము మనము కొంతవరకు ఆలోచించాలి. స్త్రీలు ప్రకృతి స్వరూపులు. వారు ప్రకృతి నుంచే ఆవిర్భవించినవారమని, వారు స్త్రీలు అని ప్రకృతికి సంబంధించిన నామమునే వారు వుచ్చరిస్తూ వుంటారు. ప్రకృతియందు వర్ధించియు వీడు నేను ప్రకృతికి విరుద్ధమైన పురుషుడను అనే పదముతో అహంకారముతో విర్రవీగుతుంటాడు. ప్రకృతికి విరుద్ధమైన పదములను వుపయోగించుకోటం చేతనే, అహంకార కారణము చేతనే భగవంతుడు అక్కడ ప్రత్యక్షము కాలేక పోతున్నాడు.

ప్రతి మానవుడు కూడను ప్రకృతిని అనుసరించక తప్పదు. ఇది ప్రకృతి యొక్క ధర్మము. ఈ ధర్మమును యెట్టి మానవుడైనను అనుసరించవలసినదే. ప్రపంచములో యే మానవుడు ఏ పదార్థమును తన వెంట తీసుకొని రాలేదు. ఏ మానవుడు తిరిగి వెళ్లే సమయమందు ఏ పదార్థమును వెంటగొని పోడు. ఈ విధమైన శాసనము కూటిపేద మొదలు కోటీశ్వరుని వరకు సమంగానే అందించినది యీ ప్రకృతి. కూటిపేద యీ జగత్తును యేవిధమైన పద్ధతిలో వదలి పోతున్నాడో, కోటీశ్వరుడు అదే స్థితిలో యీ జగత్తును వదలిపోతున్నాడు. కనుక యిట్టి బోధలు లేక ప్రకృతి శాసనములు సర్వులు కూడను అనుసరించవలసినదే అనే సత్యాన్ని గుర్తించాలి. అయితే మానవుని యొక్క మనస్తత్వము దీనికి విరుద్ధముగా గోచరిస్తుంటాది. నీరు పల్లమునకు పారటమే దాని స్వభావము. నీటి ఒక స్థిరమైన పాత్రలో నింపినప్పుడే అటూయిటూ కదలక జలము వుండగలదే గాని లేకుండిన అది నిరంతరము పల్లమునకే పారుతుంటుంది. అదే విధముగనే మనసు నిరంతరము కూడను ఏదో ఒక విధమైన పల్లమునకే ప్రసరిస్తూ వుంటుంది. దీనిని భద్రమైన పాత్రలో నింపినప్పుడే అటూయిటూ కదలకుండా వుండుటకు వీలవుతుంది. ఈ మనస్సుకు రెండు విధములైన ప్రవాహములు వుంటున్నవి. ఒకటి కామసంబంధమైన ప్రవాహము. రెండవది కాంచనము అనగా ధనసంబంధమైన ప్రవాహము. ఈ ప్రవాహమునకు ప్రక్కనే ఎట్టి నూతులను త్రవ్వినప్పటికిని యీ ప్రవాహ బలమే యిందులో ప్రవేశిస్తూ వుంటుంది. ఈ నూతులలోని జలము

715108804

కూడను తాను లాక్కుంటుంది. ప్రవాహములోని జలము అధికమైనప్పుడు నూతులలోని జలము కూడను అధికముగా వస్తూ వుంటుంది. కనుక మానవుని యొక్క తత్వము యీ రెండు ప్రవాహములకు అతి దూరముగా వుండినప్పుడే, ఆ స్థితిని గావించే నిమిత్తమై యీ యొక్క ఆధ్యాత్మిక మార్గమును అందిస్తూ వచ్చారు. నిత్యసత్యమైన తత్వమును గుర్తించుకొనే నిమిత్తమై పవిత్రమైన చరిత్రను అందించే నిమిత్తమై, సార్థకమైన కర్మలు అందించే నిమిత్తమై, కాలముచే మారక, ప్రళయముచే తరుగక, సృష్టిచే పెరగక ఏ సత్యమైతే వున్నదో ఆ సత్యమునకు శాంతి స్వరూపమైనది భారతీయ ధర్మమనేదని నిరూపిస్తూ వచ్చింది. ఈ ధర్మమునకు నీతి నిజాయతీలే సహజమైన స్థానములని కూడను నిరూపిస్తూ వచ్చింది. కనుక భగవంతుని పొందుటకు నీతి నిజాయతీలే ముఖ్యమైన మార్గములు

ఐతే యీ నీతి నిజాయతీలు కూడను ప్రకృతి ద్వారానే మనకు లభవుతాయి. జగత్తులో సమస్త పదార్థములు పరమాత్మ స్వరూపములనే మనము విశ్వసించాలి. సర్వప్రాణులు కూడను పరమాత్మని స్వరూపములుగానే మనము విశ్వసించాలి. అయితే మనయందు కామక్రోధములుగానీ, రాగద్వేషములుగానీ ఆవిర్భవించుటకు వీలుకాదు. అన్ని పదార్థములు ఒక్కటే అయినప్పుడు దేనిపైన ద్వేషముగాని, రాగముగాని వుండుటకు వీలులేదు. మానవుని యొక్క రూపనామములు వేరు వేరుగా వుండవచ్చు. కాని నిజతత్వము, దివ్యత్వము ఒక్కటే. పొట్టె కొమ్ములు వంకరగా వుంటుటాయి. పోట్లాడే సమయములో అవి చక్కగానే వుంటాయి. అదే విధముగనే సర్వమానవ స్వరూపములు భిన్న భిన్నముగా కనుపిస్తున్నాయి. వారి ముఖములు కూడను వేరువేరుగా వుంటాయి. కాని అందరిలోనూ ఆత్మతత్వము ఒక్కటిగానే వుంటుండాది. సముద్రములో అసంఖ్యాకమైన అలలు ప్రారంభమవుతూ వుంటాయి. ఒక అల వుండినట్లు మరొక అల మనకు కనుపించదు. వచ్చిన అల అంత్యమవుతూ వుంటుంది మరొక అల ప్రారంభమవుతుంది. ఎన్ని అలలు లేచినప్పటికిని యీ అలల అన్నింటియందు వుండిన జలము ఒక్కటనే సత్యమును యీ జగత్తు మనకు నిరూపిస్తున్నది. అదే విధముగనే యీ ప్రకృతియందు ఒక దివ్యమైన శక్తి సర్వవ్యాపకమై వుంటుండాది. అలాంటి ప్రకృతి తత్వాన్ని మనము మొట్టమొదలు అర్థము చేసుకోవాలి. ప్రకృతినే సాధించలేని మానవుడు యింక దేనిని సాధించగలడు. ప్రకృతిని అర్థము చేసుకొనే నిమిత్తమై మనకు మానవత్వము మనకు ప్రాప్తించినదనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. దీనినే వేదాంత పరిభాషలో నిన్ను నీవు తెలుసుకోమని వుపదేశిస్తున్నది. నిన్ను నీవు తెలుసుకొంటివా జగత్తంతా తెలుసుకున్నవాడవౌతావు.

కనుక మొట్టమొదలు యీ జగత్తును మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. అతనే జగదీశుడు. ఈ జగత్తుయందుండిన ఒక మహా చైతన్యపురుషుడు ఒక్కడే. అతనే సత్ చిత్ ఆనందుడు. అన్ని పదార్థములందు అస్తి, భాతి ప్రియమనేవి సమముగానే వుంటున్నాయి. అనిత్యము, అశాశ్వతము అయిన రూపనామ

715108805

వుంటే మనకు వేరు వేరుగా గోచరిస్తున్నాయి. అనిత్యము, అశాశ్వతము అయిన రూపనామములే మనము ఆధారము చేసుకొని నిత్యసత్యమైన అస్తి భాతి ప్రియములను మనము విసర్జిస్తున్నాము. ఇదియే యీనాడు మనము పట్టిన పెడమార్గము. ఈ మార్గమును మనము యేనాడు వుల్లంఘించి సక్రమమైన మార్గములో ప్రవేశ పడుదుమో ఆనాడే సర్వేశ్వరత్వము అర్థము చేసుకున్నవారమవుతాము.

ప్రేమస్వరూపులారా! ప్రకృతియే పరమాత్మ తత్త్వముగా మనము విశ్వసించాలి. పరమాత్ముడు ఎక్కడో వుంటున్నాడనే సులభమైన తత్వాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నం చేయటం వ్యర్థమవుతుంది. కనక సర్వజీవులు కూడను సర్వేశ్వర స్వరూపులుగానే మనము విశ్వసించాలి. కనుక యీ శరన్నవరాత్రుల యందు కేవలము తొమ్మిది దినములు యీ పవిత్రమైన ప్రకృతి తత్వాన్ని చక్కగా విపులముగా బోధించే నిమిత్తమై యేర్పడినవి. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞాన శక్తి. క్రియాశక్తి అనగా లక్ష్మి సంపత్తు. సర్వవిధములైన సంపత్తు. సకలైశ్వర్య స్వరూపమైన సంపత్తు. మానవుని ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడను ఒక సంపత్తే. మానవుని యొక్క అంగముల చైతన్యము ఒక సంపత్తే. మానవుని చూపులు కూడను సంపత్తే. మాటలు కూడను సంపత్తే. ఇవన్నీ ఐశ్వర్య స్వరూపములే. కనుకనే అతనిని ఈశ్వరుడు అని పేరు పెట్టారు. సకలైశ్వర్య స్వరూపుడే ఈశ్వరుడు. ఈశ్వరుడు సర్వత్రా వుంటున్నాడనే సత్యమును మనము యీనాడు గుర్తించాలి. జ్ఞానశక్తి అదియే సరస్వతి. ఈ సరస్వతి ఎక్కడ వున్నది. బ్రహ్మపత్ని అని మనము అనుకుంటున్నాము, ఈ బ్రహ్మ ఎక్కడ వున్నాడు. ఇవి కేవలము సత్వరజో తమోగుణముల యొక్క స్వరూపములే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. వీరిని శరీరధారులుగా యెవరు, ఎప్పుడూ చూడలేదు. కనుక ప్రకృతి త్రిగుణాత్మకమైన స్వరూపము. అదే త్రిమూర్తి స్వరూపము అన్నారు.

శబ్దబ్రహ్మమయీ చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి
నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి

ఇట్టి అష్టైశ్వర్య స్వరూపముతో కూడిన శక్తి యీ ప్రకృతి యొక్క స్వరూపము. ఈమె అన్ని విద్యలను నేర్పుతున్నది. ఈ సరస్వతి వాహనమేమిటని మనము కొంతవరకు విచారించినప్పుడు యిది హంస వాహనము అంటారు. హంస అనగా ఒక ప్రత్యేకమైన పక్షి అని మనము భావిస్తున్నాము. సరస్వతి వాక్‌స్వరూపిణి. ఈ వాక్కే సరస్వతి. ఇదే వేదస్వరూపము. ఈ వేదస్వరూపమైన వాక్కు మన నుంచి వచ్చే సమయములో ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఆధారము చేసుకొని వస్తుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు లేక మాటను వుచ్ఛరించటానికి వీలుకాదు. కనుక ఉచ్ఛ్వాస నిశ్వాసములే సోహం అనేదే హంసగా రూపొందింప చేసుకొని యీ సోహం అనే హంసనే వాక్ అనే సరస్వతి మననుండి వెలువడుతున్నాది. కనుక సరస్వతి ఎక్కడనో లేదు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములోనే వుంది సరస్వతి. కనుక దుర్గా, లక్ష్మి, సరస్వతులు దేహస్వరూపమైన దీంట్లో అంతర్భూతముగా వుంటున్నాయి. అగమ్యగోచరంగా వుంటున్నాయి. ఆశక్తియే మనలో లేకపోతే మన

ము చూడలేము, వినలేము, మాట్లాడలేము, నడవలేము, చేయలేము. కనుక మనతల్లి మనకు యేవిధముగా విద్యలను గరపుతూ వున్నదో అదే విధముగనే యీ సరస్వతి దేవతల్లి కూడను మనకు అన్నివిద్యలను అభ్యసింప చేస్తున్నది. ముగ్గురు తల్లుల బిడ్డనే ముద్దైన మానవుడు. ఈ ముగ్గురు తల్లులు మనకు ప్రత్యేకముగా లేరు. మనయందే వుంటున్నారు. గుప్తంగా, అవ్యక్తంగా మనలో దాని వున్న యీ శక్తులను వ్యక్తీకరింప చేసినప్పుడే మనము వ్యక్తులుగా తయారౌతాము ఎంతవరకు యీ శక్తులను వ్యక్తీకరింప చేసుకోలేమో అంతవరకు మనము వ్యక్తులమని చెప్ప టానికి అర్హతనే లేదు. ప్రతి తల్లీ మన నడకను చక్కగా చేయిపట్టి నేర్పుతున్నది. ఏవిధ ముగా మనము ఆహారము తీసుకోవాలి, చాలామెత్తని పదార్థములు మనకు అందించి అన్నము ను భుజించటానికి నేర్పుతున్నది. మాటలు మనకు నేర్పుతున్నాది తల్లి, మొదటి మాట అమ్మ అప్ప అనే మాటలు నేర్పుతున్నాది. మాటలు నేర్పునది తల్లి. నడకను నేర్పునది తల్లి. ఆహారము భుజించటము నేర్పునది తల్లి. అన్ని విద్యలు నేర్పునది మొదటి తల్లి మాతృమూర్తి. అందు వల్లనే వేమన కూడను చిన్న పదములతో చెప్పాడు

తల్లి తండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేల వాడు గిట్టనేల
పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా.

మనతల్లి తండ్రులనే మనము ఈశ్వరపార్వతులుగా విశ్వసించాలి. వారిని సేవించాలి. వారినే ప్రసన్నులను గావించలేని అశక్తులము యింక భగవంతుని యేరీతిగా ప్రసన్నులను గావించగలము. కనుక మనము యీనాడు నేర్చుకోవలసినది ప్రాకృతమైన, నిత్యజీవితములో సత్యమైన, అత్యవసరమైన మార్గము లోపల మనము సత్యమార్గమును అవలంబించాలి. ఆదర్శ మార్గమును నిరూపించాలి. భగవంతుని మనము ఒక శక్తిస్వరూపునిగా విశ్వసించినప్పుడే అతన్ని కూడను మనము సాధించటానికి తగిన శక్తి మనలో ఆవిర్భవిస్తుంది. ఇవన్నీ కేవలము ఒక మాతృప్రేమలోనే ఆవిర్భవిస్తున్నాయి. తల్లిపైన బిడ్డకు, బిడ్డపైన తల్లికి అన్యోన్యమైన అనురాగము వుండినప్పుడే యీ శక్తి అనేది రెండింటి ద్వారా ఆవిర్భవిస్తుంది రెండు చేతులు యేవిధముగా మనము కలిపి రుద్దినప్పుడు అందులో వేడి ఆవిర్భవిస్తుంది అదే మనశక్తి. అదే మన కరెంటు. అదే మన జ్యోతి. అదే మన భావము. తల్లిప్రేమల మధ్య అన్యోన్యమైన ప్రేమ తత్వాన్ని వాత్సల్యాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి.

మీకు రామాయణమునందు చక్కని ఆదర్శము ఒకటి వుంది. సీత వాల్మీకి ఆశ్రమములో వుంటున్నది. నిరంతరము రామ చింతనే చేస్తుంది. తన బిడ్డలైన లవకుశులు తల్లియొక్క ఆజ్ఞను శిరసావహించి తల్లి ప్రేమ లోపల, తల్లి వడిలోపలనే సర్వవిద్యలను అభ్యసిస్తున్నారు. ప్రతి విషయమందు తల్లిని అండగా నిల్పుకొని, తల్లిని సంతోషపెట్టే భావము చేత వారు నిత్య జీవితము గడుపుతున్నారు. గురువుదగ్గర నేర్చిన విద్యలన్ని కూడను ఆమెకు అప్పచెప్పేవారు. తల్లికూడను వారికి యెన్నో సుఖాపాఠము

లను నేర్పేది. కట్టకడపటికి శ్రీరామచంద్రుడు వారితో యుద్ధము చేయుటానికి వచ్చినప్పుడు యీ లవకుశులు చేసిన మహాత్యాగము ఏమిటి? తల్లిని స్మరించారు. జనని, మాత సాధ్వియని యితడు యీ అస్త్రమును మూర్ఛనొందుగాక అని తల్లిని స్మరించి అస్త్రము వేశాడు. తండ్రి శ్రీరామచంద్రుడు మూర్ఛపడ్డాడు గాని తల్లి భక్తి కలిగిన కొడుకుల ప్రభావము జగత్ వ్యాప్తిగా వించింది. కనుక మాతృ భక్తియందుండిన పవిత్ర శక్తి యొక్క దివ్యత్వాన్ని గుర్తించుకోటానికి మనము ప్రయత్నించాలి. కనుక మాతృశక్తి లోపల అట్టిది యిట్టిది, అంతది యింతది అని యెవ్వరూ కూడను నిర్ణయించటానికి సాధ్యము లేదు. కనుక మనము జన్మించిన దేశము కనిపెంచిన తల్లిని రెండు నేత్రములుగా మనము విశ్వసించి జననిని జన్మభూమిని మనము సేవించటానికి తగిన శ్రద్ధను అభివృద్ధి గావించుకోవాలి. ఈ దేశ భక్తిగాని యీ మాతృ భక్తిగాని లేకపోతే మనము మానవులమే కాము. తన ఒడిలో పెట్టుకొన్న యీ దేశము, తన యొక్క పొట్టలో నింపుకున్న యీ దేహతల్లి రెండు నేత్రములుగా భావించినప్పుడు యిది సరైన భక్తి ప్రపత్తులుగా మారుతుంది. కేవలము భక్తి భక్తి అని చెప్పి ఏవో కొన్ని సాధనలు చేసినంత మాత్రమున యిది భక్తిగా రూపొందదు. సర్వ జీవులయందుండిన మాతృభక్తి కూడను మనము గుర్తించటానికి ప్రయత్నించాలి.

మనదేహమునందున్న యీ శక్తి అంతయు దుర్గస్వరూపిణిగా మనము విశ్వసించాలి. దీనిని మనము వృధా చేయకూడదు. తల్లిని మనము వ్యర్థము చేసిన వారమౌతాము. మన చూపులతో మన శక్తినంతా అనేకముగా వ్యర్థమవుతున్నది - కనుక చల్లని చూపులుగా మనము చూడాలి. మన మాటలలో యీ శక్తి అంతా వ్యర్థమవుతున్నది. మన మాటలలో పవిత్రమైన, యితరులను ఆనందపెట్టే మాటలుగా మనము వినియోగించాలి. మన తలంపులలో కూడను అనేక విధములైన శక్తి వ్యర్థమవుతున్నది. ఈ శక్తిని మనము వ్యర్థము గావించకుండా వుండే నిమిత్తమై, సార్థకము గావించుకొనే నిమిత్తమై యీ పూజలను మనము ప్రారంభించాము. ఇందులో ప్రధానమైన ప్రార్థన ఓ తల్లీ! నా శరీరమునందు సర్వశక్తి స్వరూపిణిగా వుండిన ఓ దుర్గా నా శక్తులను సక్రమమైన మార్గములో సక్రమమైన మార్గములో, సదుపయోగమైన మార్గములో ప్రవేశపెట్టుమని ప్రార్థించాలి. ఇంక మనము తినే ఆహారము. ఇదంతా లక్ష్మీస్వరూపమే. మనము యేమాత్రము కూడను వ్యర్థము చేయకూడదు. మనకు యెంత అవసరమో అంత భుజించాలి. జలమును కూడ మనకు ఎంత అవసరమో అంతనే వినియోగించుకోవాలి. Tap లో కావలసినంత నీళ్లు వస్తున్నది కదా అని యిష్టము వచ్చినట్లుగా మనము వినియోగించరాదు. ఈ పంచభూతములు లక్ష్మీస్వరూపములే - శబ్ద స్పర్శ రూప రస గంధములైదు మనము దుర్వినియోగము చేయరాదు, శబ్దమును కూడను మనము దుర్వినియోగము చేయరాదు. ఎవరితో మనము మాట్లాడాలని భావిస్తున్నామో వారు నీవు మాత్రమే వినాలిగాని యీ పదములు మరొకరు వినకుండా వుండే రీతిగా అంత మృదు మధురంగా వాడాలి. కొంతమంది రూములో

715108808

మాట్లాడుతుంటే బజారుకి వినిపిస్తూ వుంటుంది. ఈ విధమైన శబ్దాన్ని మనము దుర్వినియోగపరచిన వారమవుతాము. మనయొక్క తల్లిప్రేమను వ్యర్థము గావించిన వారమవుతాము కనుక ఈ లక్ష్మీ స్వరూపిణి యైన సర్వశక్తులు మనము దుర్వినియోగము చేయకుండా చూచుకోవాలి.

చదువులు. ఈ చదువులు మనము సార్థకము గావించుకుంటున్నామా?

వేదవేదాంగములు వల్లెవేసియున్న
గద్యపద్యంబులను కూర్పగలిగియున్న
చిత్తశుద్ధియె లేకున్న చెడును నరుడు.

ఎన్ని గ్రంథములు చదివి ప్రయోజనమేమిటి? ఎన్ని వేదాంతములు వ్యుత్పత్తించి ప్రయోజనము యేమిటి? అందులో ఒక్కటైనా మనము ఆచరిస్తున్నామా? ఆచరించలేని విద్య కేవలము అవిద్యలుగానే రూపొందుతాయి. తెలుసుకున్న విషయాన్ని మనము ఆచరణలో పెట్టాలి. దీనిని పురస్కరించుకొనియే Celing on desires అనే సాయిస్థాపనలలో ప్రారంభించాము. Do not waste food. Food is God. ఆ food వలనే మన head, head వలనే God తత్వాన్ని మనము అర్థము చేసుకోగలుగుతున్నాము. ఒక రోజు food లేకపోతే head పని చేయదు. ఒక రెండు మూడు దినాలు అదేవిధముగా ఆచరించినామంటే అన్నం తినకుండా మన జ్ఞాపకశక్తి నశించిపోతుందాది. కనుక మన headను నిలబెట్టేది food. ఈ head ను సక్రమమైన మార్గములోకి చేర్చేదెవరు అతనే God. కనుక donot waste food. ఇంక రెండవది Dont waste money. ధనము లక్ష్మీస్వరూపము. Misuse of money is evil అన్నారు. దుర్వినియోగము చేసిన ధనము వ్యర్థమైనది. ఇంక భగవత్ స్వరూపమైనది కాలమే. కాలాయనమః, కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః, కాలాతీతాయనమః, కాలస్వరూపాయనమః, కాలనిర్ణితాయనమః అంతా కాలమే. కనుకనే Dont waste time, time waste is life waste. మన జీవితము వ్యర్థమైపోతుంది. ఇంక దివ్యమైన దుర్గాశక్తి energy. చెడ్డ చూపులు, చెడ్డ మాటలు, చెడ్డ వినికిడి, చెడ్డ తలంపులు, చెడ్డ పనులు చేయకుండా వుండటం. దీనిలోనే మనశక్తినంతా ధారపోసుకుంటున్నాము. ఇవన్నీ దైవస్వరూపములే. కనుక దైవమును మనము వ్యర్థము గావించుకున్నప్పుడు మన జీవితమే వ్యర్థమైపోతుంది.

కనుక వీటిని వ్యర్థము గావించకుండా సార్థకము గావించుకొనే మార్గాన్ని మనము యీనాడు కనిపెట్టాలి. మంచిని ఆచరించాలి. ఆచరించిన దాన్ని అనుభవించాలి. అనుభవించిన దానిని పెంచుకోవాలి. పెంచుకున్న దానిని పదిమందికి పంచుకోవాలి. ఇదే మానవుని ప్రధాన కర్తవ్యము. ఈ విధమైన ప్రతిశక్తిని మనము కొంతవరకు సాధన చేత వశముగావించుకున్నప్పుడు అదియే యోగః చిత్తవృత్తి నిరోధకః. భారత

715108809

దేశమందు మహనీయులైన ఋషులందరు యీ విధమైన సక్రమమైన మార్గములో తమశక్తులనం
తా సద్వినియోగము చేసుకోటం చేతనే దైవత్వమును వారు చూడగలిగారు. వారు తెలుసు
కున్నది జగత్తువకంతా చాటారు. ఏమని? ఆ భగవంతుని, ఆమహాతేజ స్వరూపుడైన మహా
పురుషుని తెలుసుకున్నాము మేము తెలుసుకున్నాం. ఎక్కడ తెలుసుకున్నాము. తమస్సు
అనే అజ్ఞానము యొక్క ఆవలనున్న మహాపురుషుణ్ణి తెలుసుకున్నామన్నారు. మనలో యీ
నాడంతా తమస్సే. ఈ తమస్సు దాటినప్పుడే తపస్సుగా మారిపోతుంది. కనుక నేను,నాది
అనే అజ్ఞానము వుండి సార్థమైనంత వరకు దూరమై తాను అంతా నేనే అనే సత్యాన్ని గుర్తించ
టానికి ప్రయత్నించాలి. ఇదే బైబిలనందు జీసస్ అనేక విధములుగా చాటుతూ వచ్చి
డు. కొంతకాలము సాధన చేశాడు. I am the messenger of God అన్నాడు. నేను
భగవంతుని దూతను అన్నాడు. అతను దూత మాత్రమే గాని భగవంతుని యొక్క నేతకాడు.
నేనొక servent, నేనొక పనిముట్టు, నేనొక యంత్రియమును. అని భావిస్తూ వచ్చాడు.
క్రమక్రమేణా తనలో వుండిన శక్తినంతా సద్వినియోగపరచుకోటంచేత, కొంతకాలమై
న తరువాత I am the son of God అన్నాడు. నేను ఆ భగవంతుని బిడ్డను అనే సత్యా
న్ని గుర్తించుకున్నాడు. son of God అంటే తండ్రి, కొడుకు. తండ్రికి కొడుక్కు కొంతస
న్నిహిత సంబంధము చేరిపోతుంది. కాని son గా వుండినంత వరకు తండ్రి ఆజ్ఞశిరసా
వహించాలి కదా. మేము యిద్దరము ఒక్కటి అయ్యేది యే మార్గము అని విచారణ చేస్తూ
వచ్చాడు. పన్నెండు సంవత్సరములు ఎడారుల లోపల కూర్చున్నాడు. తండ్రి కొడుకు, తం
డ్రి కొడుకు యీ రెండింటి యొక్క సంబంధాన్ని గుర్తించుకుంటూ వచ్చేసి కట్టకడప
టికి I and my father are one అన్నాడు. ఈ ఏకత్వమైన అద్వైతములో ప్రవేశించా
డు. అప్పుడే Holy ghost. ఈ విధమైన దివ్యత్వాన్ని పొందగలుగుతూ వచ్చాడు. మహమ్మ
దీయులు కూడను అదే రీతిగా చెప్తూ వచ్చారు. నేను భగవంతుని యొక్క శక్తిలో ఒక అణు
వుగా వుంటున్నాను. తేజోవంతమైన ప్రకాశము లోపల నేనొక పురుగుగా వుంటున్నాను. నేను
అతని తేజస్సులో జీవిస్తున్నాను గాని నేను స్వతసిద్ధముగా లేను. కనుకనే వారు I am in
the light అన్నారు. కొంతకాలము నేనే యీ జ్యోతిలో వుంటున్నాను. నేను యీ జ్యోతిలో వుం
టున్నాను కాని యీ జ్యోతిలో వుండటానికి నాలో కూడను జ్యోతి వుండాలి కదా అని ఒకవిధమైన
విచారణ ప్రారంభమైంది. ప్రాఫెట్ మహమ్మద్ దాని యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించటానికి
ప్రయత్నించాడు. కొంత కాలము జరిగిన తరువాత. The light is in me అనే సత్యాన్నిగుర్తించా
డు. తనలో ఆలైటు, తాను లైటులో యీ రెండింటియందు నేను దేవునిలో దేవుడు నాలో
అని రెండింటి యొక్క రెండింటి సమత్వము చేర్చుకుంటూ రావటంవల్ల I am the
light అని చెప్పాడు. ఇక్కడ ఏమిటంటే ప్రతిమతము కూడను తమ యొక్క గమ్యా
న్ని గుర్తించుకునే నిమిత్తమై మార్గములు వేరువేరు అయినప్పటికిని గమ్యము ఒక్కటే
అనే సత్యాన్ని నిరూపిస్తూ వచ్చారు. కాని యీ నాటి మానవ హృదయములు చాలా సంకుచిత

T15108810

మైనవిగా వుండటం చేతను, స్వార్థము స్వప్రయోజనముతో నిండిపోవటం చేతను కేవలము మతకలహములు పెరిగిపోయి భగవంతుని ఒక విధమైన Party leader గా భావించుకోటానికి పూనుకుంటూ వచ్చారు. భగవంతునికి సంపూర్ణ శరణాగతుడైనవానికే నిజమైన భగవత్ తత్వము అర్థమవుతుంది. కొంతవరకు ఆసత్యమును వారు గుర్తించటానికి వీలుకాదు.

ప్రేమస్వరూపులారా! భగవంతుడు మనయందే వుంటున్నాడు. సమస్త శక్తులు మనయందే వుంటున్నాయి. సమస్త తేజస్సు మనయందే వుంటున్నది. ఇది కేవలము మానవ ఆకారమే గాని దివ్యమైన స్వరూపము. ఇది యిహలోకము కాదు. ఇది జీవలోకము కాదు. ఇది దేవలోకమనే సత్యాన్ని మీరు గుర్తించి వర్తించండి. అప్పుడే మీరు సత్యమును తెలుసుకున్నవారౌతారు. మీరే సత్యస్వరూపులౌతారు. ఈ రెండింటిని సమన్వయము గావించేది ప్రేమ ఒక్కటే. ప్రేమను పెంచుకోండి. పెంచుకొని పదిమందికి పంచుకోండి.